క్లుప్తంగా

వరి విత్తనాల కోసం ఆందోళన వద్దు

మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



నకరికల్లు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కోసం ఆందోళన పడవద్దని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నెస్పీ కాలువ ద్వారా మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. అలాగే 3 వేల క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే లైసెన్స్ పొందిన డీలర్‌లు సుమారు 2,091 క్వింటాళ్ల విత్తనాలు విక్రయించడం జరిగిందన్నారు. జేజీఎల్ 384 రకం విత్తనాలు 1,052 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 836 క్వింటాళ్లు, కేఎన్ఎం 733 రకం 47 క్వింటాళ్లు, కేఎన్ఎం 1638 రకం 45, అజిత, సోనాలి, అన్నపూర్ణా, పూజిత రకాలు 111 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు విక్రయించడం జరిగిందన్నారు. మిగిలిన 900 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. జేజీఎల్ విత్తనాలే కాకుండా కేఎన్ఎం-1638, ఎంటీయూ 1224, కేఎన్ఎం 733, ఎంటీయూ 1282, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను కూడా ఈ సీజన్‌లో సాగు చేయవచ్చన్నారు.

గేదెలు మేపేందుకు వెళ్లి మృత్యువాత



ముప్పాళ్ళ: గేదెలను మేపేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో మృతి చెంది కనిపించిన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ళలో జరిగింది. మండల కేంద్రమైన ముప్పాళ్ళకు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి(63) ఆదివారం గేదెలను మేపేందుకు పొలానికి వెళ్లాడు. సాయంత్రానికి గేదెలు ఇంటికి వచ్చినప్పటికీ వెంకటేశ్వరరెడ్డి రాత్రయినా ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు, బంధువులు పొలాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. సోమవారం ఉదయం చెరువు సమీపంలో చేతికర్ర, చెప్పులు ఉండటాన్ని గమనించి చెరువులో వెతుకుతుండగా వెంకటేశ్వరరెడ్డి మృతదేహం పైకి తేలటంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు. మృతునికి ముగ్గురు పిల్లలున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మాదల(ముప్పాళ్ళ): తల్లిదండ్రులు మందలించారనే కోపంతో ఇంజనీరింగ్ విద్యార్థి పురుగుమందు తాగి అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని మాదల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన సుంకర చంద్రశేఖర్(22) నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వెనుకబడకుండా హాస్టల్‌లో ఉండి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో ఆదివారం చంద్రశేఖర్ ఇంట్లోనే తలుపు వేసుకొని గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మీలు గమనించి హుటాహుటిన సత్తెనపల్లిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు.

బీసీ హాస్టల్‌లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



రాజుపాలెం: నేషనల్ యాంటీక్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా కమిటీ కార్యవర్గ సభ్యులు మండల కేంద్రంలోని రాజుపాలెం బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం సందర్శించారు. పిల్లలతో కమిటీ సభ్యులు ముఖాముఖీ మాట్లాడారు. వసతి గృహంలో సమస్యలను గుర్తించారు. విద్యార్థులకు తగినట్లుగా రూమ్‌లు లేవని, వర్షం వస్తే గదులు కారడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. బాత్‌రూమ్‌లు, మరుగు దొడ్లు శుభ్రంగా లేక దుర్వాసన వెదజల్లుతున్నాయని తెలిపారు. కొన్ని బాత్‌రూమ్‌లకు సక్రమంగా డోర్‌లు లేవు, గదులలో ఫ్యాన్‌లు లేక దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నరు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామని కమిటీ కార్యకర్గ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షులు గరికపాటి శంకరరావు, ఉపాధ్యక్షులు కోడిరెక్క కుమార్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వేద ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 400 మంది ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, నోటు, పాఠ్య పుస్తకాలు మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతాడ లలితాంబ మాతాజీ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ అరుణ, అనూష, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల సందడి షురూ

- ఓటర్ల జాబితాలు విడుదల చేసిన హెచ్ఎంలు
- ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు
- నియోజకవర్గంలో 225 విద్యా సంస్థలు

సత్తెనపల్లి నియోజకవర్గంలో పాఠశాలల సమాచారం...

కేటగిరీ	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక పాఠశాలలు	168	7,337
ప్రాథమికోన్నత పాఠశాలలు	18	1,975
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	31	11,402
కస్తూర్బాగాంధీ విద్యాలయాలు	04	994
ఏపీ గురుకులాలు	03	1,187
ఏపీ మోడల్‌స్కూల్	01	506
మొత్తం	225	23,401



సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారం



ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నోటీస్ బోర్డులో అంటించిన ఓటర్ల జాబితా



వడ్డవల్లి ఎంపీపీఎస్(హెచ్ఈ) పాఠశాల నోటీస్ బోర్డులో అంటించిన ఓటర్ల జాబితా

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల సందడి షురూ అయింది. నియోజకవర్గంలోని సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మొత్తం 225 పాఠశాలలు ఉండగా వాటిలో 23,401 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి పాఠశాలల్లోని నోటీసు బోర్డులో పెట్టారు. సోమవారం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడం, అనంతరం తుది జాబితా సిద్ధం చేశారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులెత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన సభ్యులు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 3 నుంచి 5 గంటల్లోపు కొత్త కమిటీ సమావేశం జరుగుతుంది.

225 పాఠశాలల్లో ఎన్నికలు

సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఒక పట్టణం, నాలుగు మండలాల్లో 225 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైనచోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎన్నికైన సభ్యులతో పాటు ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షుడు వారి ప్రాంతాల్లో ఎప్పుడైనా ఎస్ఎంసీ సమావేశాలకు వారి ఇష్ట ప్రకారం హాజరుకావచ్చు.

ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు

నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా గతంలో ఎన్నికలు జరిగినా ఎక్కడా ఎన్నికలు వాయిదా పడలేదు. ప్రశాంతంగా ముగిశాయి. ఒకటి రెండు చోట్ల వాయిదా పడినప్పటికీ తరువాత ఆ ఎన్నికలను కొనసాగించారు. కొన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నిక పోటాపోటీగా జరిగినా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికలను సైతం కొందరు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎస్ఎంసీ కమిటీలో భాగస్వాములయ్యారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారా అనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల విధానం ఇలా...

- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికలను నిర్వహించాలి. ఈ మేరకు తొలుత తల్లిదండ్రుల కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి. 59 శాతం మంది తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలి.
- తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలు ఎన్నిక తరగతుల్లో ఉంటే అన్ని తరగతుల్లో ఎన్నిక విధానంలో పాల్గొనవచ్చు. కానీ సభ్యులను ఎన్నుకునేందుకు ఓటు వేసేందుకు ఒక్కరికే అవకాశం ఉంటుంది.
- సాధారణంగా చేతులెత్తే ప్రక్రియ లేదా చెప్పడం ద్వారా ఎన్నిక జరగాలి. అసాధారణ పరిస్థితిలో బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలి.

నాణ్యమైన వరి నారుతో అధిక దిగుబడులు



వరినారు మడిని పరిశీలిస్తున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరు: ఆరోగ్యవంతమైన వరి నారు పెంచేందుకు చేపట్టాల్సిన పద్ధతులను ఏవో వేణుగోపాల్ సోమవారం తెలియజేశారు. క్రోసూరులోని వరి నారుమడిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మండలంలో రైతులు నీటి వసతి ఉన్న చెరువులు, బావులు, బోర్ల కింద వరి నారు మడులు పెంచటం జరుగుతుందని, అయితే నాణ్యమైన, ఆరోగ్యవంతమైన నారు పెంచటం వలన అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో తెలిపారు. నారు పెంచేందుకు ఎకరానికి 20 నుంచి 25 కిలోల వరి విత్తనం తీసుకోవాలన్నారు. ఒక ఎకరంలో నాటటానికి 5 సెంట్ల విస్తీర్ణంలో 10-12 రోజుల వ్యవధిలో మూడు సార్లు దమ్ము చేయాలన్నారు. నారు మడిలో నీటిని పెట్టటానికి, తీయటానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ దుక్కిలో వేయాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున నాటాలన్నారు. నారు విచ్చుకొనే వరకు ఆరుతడులు నీరు ఇచ్చి తరువాత పలుచగా ఇవ్వాలన్నారు.

దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మహారాష్ట్ర వీధిలో పూజలు అందుకుంటున్న భక్తాంజనేయస్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో గల భక్తాంజనేయ స్వామి దేవస్థానం అధ్యక్షుడిగా ఫిరోజీ నియమితులయ్యారు. భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి ట్రస్ట్ నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా హనుమాన్ చాలీసా పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాణ స్వీకార కమిటీతో పాటు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం అధ్యక్షుడిగా పులహరి ఫిరోజీ, ఉపాధ్యక్షుడిగా కటకం నరసింహారావు, కార్యదర్శిగా తేనేటి శివప్రసాద్, సహాయ కార్యదర్శిగా పులహరి శివాజీ, కోశాధికారిగా దేవరశెట్టి రఘు కిషోర్, ఉపాధ్యక్షులుగా ఘటకాల లింగోజీ, సింధు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కాలే కళ్యాణ్, గౌరవ సలహాదారులుగా కొత్త రామకృష్ణ, చలువాది చిన్న సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా పులహరి విశ్వనాథ్, తేనేటి అశోక్, పులహరి అంజలి, తేనేటి ఉష, కటికే కోటేశ్వరరావు, భవిరిశెట్టి సుకన్య, జాదం రామసాయి, కాకర్ల వనజ, వందేకారి పవన్, పెరుమాళ్ళ రాజశ్రీలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులహరి భానోజీ, భవాని ప్రసాద్, పి.గోవిందు, నర్సోజి పాల్గొన్నారు.

న్యాయవాదులపై తప్పుడు కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలి



కోర్టు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: న్యాయవాదులపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ అన్నారు. న్యాయవాదులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాలుగు కోర్టుల పరిధిలోని న్యాయవాదులు విధులు బహిష్కరించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపి నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ పట్టాభిపురం, మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లలో న్యాయవాదులు నాగరాజు, గవాస్కర్లపై పోలీస్ అధికారులు తప్పుడు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. పట్టాభిపురం పీఎస్‌లో నాగరాజు అనే న్యాయవాది చట్టపరంగా ఉన్న వారెంట్ ఎగ్జిక్యూట్ చేయడానికి కక్షిదారులతో కలిసి వెళ్లినప్పుడు పోలీస్ అధికారి తప్పుడు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే మంగళగిరిలో కూడా న్యాయవాది గవాస్కర్‌పై తప్పుడు కేసు బనాయించటం జరిగిందన్నారు. న్యాయవాది పూజల వెంకట కోటయ్య న్యాయవాదులపై తప్పుడు కేసులు పెట్టడం పోలీసుల తీరుకు గర్హణీయమన్నారు. డీజీపీ, ఐజీ ఈ విషయంపై స్పందించాలన్నారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్‌రహీం, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, రాజవరపు నరసింహారావు, సూరె వీరయ్య, పి.హరిబాబు, రామిరెడ్డి, బాల కోటయ్య, చావా బాబురావు, ఆర్.గోపాలకృష్ణమూర్తి, సాంబిరెడ్డి, సాంబశివరావు, హరినాథ్, రామాంజనేయులు, విజయ్‌భరత్, కృష్ణ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించండి



పెదకూరపాడు: గ్రామ రెవెన్యూ సహాయకులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సూరిబాబులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న జీవోను వెంటనే రద్దు చేయాలని, సహాయకులు పార్ట్‌టైమ్ ఉద్యోగులని, వీఆర్ఏ 2005 సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా వాచ్‌మెన్ పోస్టులను, అటెండర్ డ్యూటీలు చేయించరాదన్నారు. పేస్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ప్రమోషన్లు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మండల గ్రామ రెవెన్యూ నూతన పాలకవర్గ ఎన్నికలు నిర్వహించారు.

వైభవంగా అయోధ్యస్వామి ఆరాధన మహోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరులో వేంచేసిన అవధూత అయోధ్యస్వామి 19వ ఆరాధన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో అనేక మంది భక్తుల నడుమ సాగింది. వేద పండితులు ఆదిత్యాశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అయోధ్యస్వామి విగ్రహానికి ఏకరుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో డప్పుల వాయిద్యాలు, మహిళల కోలాటంతో స్వామి వారిని నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య



బెల్లంకొండ: గ్రామాలలో రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకునే విధంగా సిబ్బంది అవగహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలోని గ్రామ రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదుపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా కౌలు రైతుల పంటలు కూడా నమోదు అయ్యేలా పంటల సాగుదారుల పత్రాలు జారీ చేసి, పంట నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హై జంప్‌లో శిశుమందిర్ విద్యార్థి ప్రతిభ

పెదకూరపాడు: విజయవాడలో నిర్వహించిన 8 జిల్లాల హై జంప్ పోటీల్లో అమరావతి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థి పి.నాగయ్య ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభను కనబర్చాడు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్య సభ్యులు పులిపాటి వెంకట్ పవన్‌కుమార్ కౌశిక ప్రసాద్, వాకా వెంకటేశ్వర్లు, వారణాసి వెంకటేశ్వర శర్మ, శివపార్వతి, పాఠశాల హెచ్ఎం కోలా వెంకటేశ్వరరావులు నాగయ్యను అభినందించారు.

ఘనంగా తిరుపతిరెడ్డికి నివాళి



పెదకూరపాడు: 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ స్కూల్ భూదాత స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యాదాత గుత్తికొండ తిరుపతి రెడ్డి వర్ధంతిని జెడ్పీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని ఎంతో తపనతో విద్యను ప్రోత్సహించిన వ్యక్తి తిరపతిరెడ్డి అని కొనియాడారు. అనేక సంస్థలకు భూ దానం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. కార్యక్రమంలో కాశిపాడు మాజీ సర్పంచ్ మోహన్‌రావు, విద్యావేత్త శివ రామయ్య, రమణ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో వాష్ బేసిన్‌లకు ట్యాపుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వాష్ బేసిన్‌లకు బిగించిన ట్యాప్‌లు

సత్తెనపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వాష్ బేసిన్‌లకు సోమవారం ట్యాప్‌లను బిగించారు. సాక్షి దినపత్రికలో ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యపు నీడలు అనే శీర్షికతో సోమవారం ప్రచురించిన వార్తకు విద్యా శాఖ అధికారులు స్పందించారు. సత్తెనపల్లి మండల విద్యా శాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాల్లో ఉపాధ్యాయుల కొరత లేదని, ఉన్నత పాఠశాలలో ఎక్కడైనా సబ్జెక్టు టీచర్స్ అవసరమైతే మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. విద్యార్థుల నమోదు ఇంకా పూర్తి కాలేదని, యు డైస్‌లో పేర్లు ఎక్కించాల్సిన విద్యార్థులు చాలా మంది ఉన్నారన్నారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గదల ప్రస్తుతానికి చాలా స్వల్పమన్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్లు సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నారని, కొన్ని మరమ్మతులు కంపెనీ సాంకేతిక సిబ్బంది మాత్రమే చేయగలరన్నారు. కంపెనీ వారికి ఫోన్, మెసేజ్ ద్వారా తెలియజేశామన్నారు. అప్పటి వరకు విద్యార్థులకు స్థానికంగా ఉన్న నీటి వనరుల నుంచి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుని సురక్షితమైన తాగునీరు అందించమని ప్రధానోపాధ్యాయులకు సూచించామన్నారు.

విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయాలి

- పాటిబండ్ల ఆర్‌సీఎం పాఠశాలను సందర్శించిన విద్యా శాఖ ఆర్‌జేడీ
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు



విద్యార్థి సామర్థ్యం పరిశీలిస్తున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

పెదకూరపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి కోరారు. మండలంలోని పాటిబండ్ల ఆర్‌సీఎం పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి వారాంతర పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చని విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంఈవో-2 సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో అరుణ, రైతులు

ముప్పాళ్ళ: వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. సోమవారం మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పత్తి పొలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ముందుగా పొలంలో గొర్రు, గుంటకతో కలుపు యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. 40 రోజులు పైబడిన పైరులో మెగ్నీషియం లోపంతో ఆకులు అక్కడక్కడ ఎర్రగా మారుతున్నాయని, నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు 2 కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చు పురుగు నివారణకు ఎసిఫేట్ 350 గ్రాములు లేదా ఏసిటామిప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న కంచె పంటగా 2-3 వరసలు నాటినట్లయితే రసం పీల్చే పురుగులు ఆశించవన్నారు. ఎకరాకు 10 ఆముదపు మొక్కలు నాటినట్లయితే పొగాకు లద్దెపురుగు నియంత్రించుకోవచ్చన్నారు. కంది పంటను పత్తి పంటలో 5-6 వరుసలకు ఒక వరుస నాటినట్లయితే మిత్ర పురుగుల సంతతి పెంచవచ్చన్నారు. వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్‌లకు అండగా రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్



సమావేశంలో నరసరావుపేట రూరల్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, సభ్యులు

నకరికల్లు: దైవ విశ్వాసులందరికీ దేవుని వాక్యాన్ని విస్తృతంగా బోధించాలని నరసరావుపేట రూరల్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు సీహెచ్ డేవిడ్ అన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలోని ఇమ్మానుయేలు ప్రార్థన మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ నరసరావుపేట రూరల్ మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి పాస్టర్‌లు ఐక్యంగా ఉండాలన్నారు. ఫెలోషిప్ సోదరులందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా అడిషనల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ సుబ్బారావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు నందమూరి క్రిస్టర్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సంఘం అడ్మినిస్ట్రేటర్ జె.చక్రవర్తి, ట్రెజరర్ టి.రత్నకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



న్యూ చిట్యాలలో అవగహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బెల్లంకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని ఐసీడీఎస్ మాచాయపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ వనజ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని న్యూచిట్యాల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యం కోసం తల్లిపాలను తప్పకుండా ఇవ్వాలన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలను ఇవ్వాలని, బిడ్డ ఆరు నెలల వయస్సు వచ్చే వరకూ కేవలం తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. కారక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాంబశివరావు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రు పాలు రక్షక కవచం లాంటివి

క్రోసూరు: బిడ్డ జన్మించిన వెంటనే ఇచ్చే తల్లిపాలు రక్షక కవచమని ఐసీడీఎస్ క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. సోమవారం క్రోసూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి పాల్గొని తల్లిపాల విశిష్టత గురించి బాలింతలకు, మహిళలకు తెలియజేశారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు అందించటం వలన బిడ్డకు రోగనిరోధకశక్తి వస్తుందని తెలిపారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాంటివన్నారు. బిడ్డజన్మించిన గంటలోపే అందించే ఈ పాలు బిడ్డకు అందించాలన్నారు. బాలికల, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాల గురించి అవగాహన కల్పించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాల వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది

రాజుపాలెం: మండలంలోని కొండమోడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత మాట్లాడుతూ మూఢ నమ్మకాలు వీడి పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలని వాటి వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గ, షేక్ ఖాశింబి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.